ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024




కాశీబుగ్గ: అన్న క్యాంటీన్‌లో టిఫిన్ తింటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


శ్రీకాకుళంలోని అన్నక్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్



ఐదేళ్ల తర్వాత

- శ్రీకాకుళం, పలాసలో అన్నక్యాంటీన్లు ప్రారంభం
- భోజనం చేసిన వందలాది మంది పేదల సంతృప్తి
- సీఎం చంద్రబాబు పాలనపై ప్రశంసలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో 'మూత'పై విసుర్లు
- 'కూటమి'తోనే తమ ఆకలి తీరిందని సంతోషం

(అరసవల్లి)

నిరుపేదల ఆకలి తీరింది. రూ.5కే నాణ్యమైన.. రుచికరమైన భోజనం అందించడంతో వారి మనసులో ఆనందం ఉప్పొంగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శ్రీకాకుళం, పలాసలో అన్నక్యాంటీన్లు శుక్రవారం ప్రారంభించగా.. వందలాది మంది పేదలు కడుపునిండా భోజనం చేశారు. చంద్రబాబు పాలనపై ప్రశంసలు కురిపించారు. 'ఇన్నాళ్లూ ఆకలితో ఎంతో బాధపడ్డాం. గతంలో టీడీపీ హయాంలో నగరానికి ఏ పనిమీద వచ్చినా తక్కువ ఖర్చుతోనే అన్నక్యాంటీన్లలో భోజనం చేసి కడుపు నింపుకునే వాళ్లం. కానీ, వైసీపీ పాలనలో అన్నక్యాంటీన్లు మూసేయడంతో గత ఐదేళ్లూ చాలా ఇబ్బందులు పడ్డాం. అధిక ధర చెల్లించి బయట భోజనం చేయలేక.. పస్తులుండేవాళ్లం. ఎట్టకేలకు మా ఆకలి బాధలు తీర్చేలా సీఎం చంద్రబాబునాయుడు అన్నక్యాంటీన్లు ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది' అని నిరుపేదలు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.




శ్రీకాకుళం అన్నక్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు

రుచికరమైన భోజనం

మాలాంటి వారి బాధలను ఎవరు పట్టించుకుంటారు. పనికోసం నగరానికి వస్తాం. పని దొరికితే పరవాలేదు. లేదంటే పస్తులే. ఆకలితోనే ఇంటికి వెళ్లిపోతాం. మాలాంటి వారిని ఆదుకునే ప్రభుత్వం ఇది. మా ఆకలి బాధలు తప్పిపోయాయి. ఎంతో రుచికరమైన, శుభ్రమైన భోజనం అందించారు.
- బొంతు రాములు, యాతపేట, కుశాలపురం





చంద్రబాబే దిక్కు

నిరుపేదలమైన మాలాంటి వారికి చంద్రబాబునాయుడే దిక్కు. ఇన్నాళ్లూ ఆకలితో బాధపడ్డాం. అన్నక్యాంటీన్ ప్రారంభించడంతో.. ఇప్పుడా బెంగ తీరిపోయింది. కడుపు నిండా భోజనం చేసే అదృష్టం దక్కింది.
- సూరమ్మ, దమ్మల వీధి, శ్రీకాకుళం

మాది పేదల ప్రభుత్వం

- మండల కేంద్రాల్లో అన్నక్యాంటీన్ల ఏర్పాటుకు కృషి
- నాణ్యతతో ఆహారాన్ని అందిస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి, ఆగస్టు 16: 'ఎన్డీయే కూటమి.. పేదల ప్రభుత్వం. పేదల ఆకలి తీర్చడంలోనే నిజమైన ఆనందం ఉంది' అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్, పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. స్వయంగా పేదలకు భోజనాలు వడ్డించారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'టీడీపీ హయాంలో చంద్రబాబు అమలు చేసిన అన్నక్యాంటీన్లను.. వైసీపీ పాలనలో జగన్మోహన్‌రెడ్డి మూసివేసి.. నరరూప రాక్షసుడిగా గుర్తింపు పొందారు. టీడీపీ నేతలు సొంత నిధులతో నిర్వహించిన అన్నక్యాంటీన్లను సైతం కూల్చేసి.. పేదల కడుపుకొట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మళ్లీ అన్న క్యాంటీన్లను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రజలకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందిస్తాం. ప్రతి మండల కేంద్రం, గిరిజన ప్రాంతాల్లోనూ అన్న క్యాం టీన్ల ఏర్పాటుకు కృషి చేస్తాం. మూడు పూటలా ఒక్కొక్కరికి టిఫిన్, భోజనం పెట్టేందుకు రూ.90 ఖర్చవుతుంది. ఇందులో ప్రభుత్వమే రూ.75 భరిస్తుంది. అన్న క్యాంటీన్ ట్రస్టుకు దాతలు విరాళాలు ఇవ్వాలి. పేదల ఆకలి తీర్చే ఈ మహా యజ్ఞంలో భాగస్వాములు కావాల'ని పిలుపునిచ్చారు. అలాగే ఎమ్మెల్యే గొండు శంకర్ విజ్ఞప్తి మేరకు.. నిత్యం రద్దీగా ఉండే శ్రీకాకుళంలోని డైఅండ్‌నైట్ జంక్షన్‌లో మూడో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. తక్కువ సమయంలో అన్న క్యాంటీన్లను సుందరంగా తీర్చిదిద్దిన కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసును అభినందించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ పైడిశెట్టి జయంతి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా బాధలు తప్పాయి




అన్న క్యాంటీన్లు మళ్లీ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. ఇక నుంచి మాకు ఆకలి బాధలు తప్పాయి.
- గురుమూర్తి, డెంకాడ

కష్టాలు తీర్చే ప్రభుత్వం



శ్రీకాకుళం ఏదైనా పనిమీద వస్తే గతంలో అన్నక్యాంటీన్‌లో భోజనం చేసి.. ఆకలి తీర్చుకునేవాడిని. గత ఐదేళ్లుగా అన్నక్యాంటీన్లు మూసివేయడంతో చాలా ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు అన్నక్యాంటీన్లు ప్రారంభించడం ఆనందంగా ఉంది. పేదల కష్టాల తీర్చే ప్రభుత్వం ఇది.
- గొలివి పాపయ్య, జర్జాం గ్రామం, ఎచ్చెర్ల

మాట నిలబెట్టుకున్నారు



గతంలో రోజూ అన్న క్యాంటీన్‌కు వెళ్లి ఆకలి తీర్చుకునేదాన్ని. కానీ గత కొన్నేళ్లుగా ఆ అవకాశం లేకుండా పోయింది. ఎవరైనా అన్నం ఇస్తే తినడం.. లేదంటే మంచినీళ్లు తాగి పొట్ట నింపుకునేదాన్ని. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మా కష్టాలు, కన్నీళ్లు తుడిచే చంద్రబాబు నిండు నూరేళ్లు హాయిగా బతకాలి.
- మురపాక అప్పలమ్మ, నిమ్మాడ


మొండేటివీధిలో అమ్మవారికి అలంకరణ..

వరలక్ష్మీ.. నమోస్తుతే

- భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

(శ్రీకాకుళం కల్చరల్)

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని.. జిల్లాలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. జిల్లావ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి.. 'వరలక్ష్మీ.. నమోస్తుతే' అని పూజించారు. శ్రీకాకుళంలోని మొండేటివీధిలోని శ్రీ లలితాదేవి సహిత శివకామేశ్వరి ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నానుబాలవారి వీధిలోని విజయదుర్గమ్మ, సంతోషిమాత ఆలయాల్లో పూజలు చేశారు. శ్రీ సత్యసాయి సేవా సమితి పెద్దమందిరంలో 108 మహిళలతో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు.


సత్యసాయి సేవా సమితి పెద్దమందిరంలో పూజలు చేస్తున్న మహిళలు

వైద్యులకు రక్షణ కల్పించాలి

- జూనియర్ డాక్టర్ల డిమాండ్
- కొనసాగుతున్న సమ్మె..

అరసవల్లి ఆగస్టు 16: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా.. వైద్యులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకుంది. శ్రీకాకుళంలో జీజీహెచ్ (రిమ్స్) కళాశాల వద్ద జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరిస్తూ పెద్దఎత్తున నిరసన చేపట్టారు. వలయాకారంలో నిల్చుని.. తమకు న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. జూనియర్ డాక్టర్ల జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేష్ మాట్లాడుతూ వైద్యులకు రక్షణ కల్పించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేవరకూ అత్యవసర సేవలను కూడా బహిష్కరిస్తామని తెలిపారు. శుక్రవారం రాత్రి కూడా జూనియర్ వైద్యులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు అంబేద్కర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ మోహిత్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ రాజ్‌కుమార్, ప్రియాంక, ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, పీజీలు పాల్గొన్నారు.

24 గంటలపాటు వైద్యసేవలు బంద్

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా.. 24 గంటలపాటు (శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు) అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిపివేయనున్నట్టు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు సనపల నర్సింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం అందిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.


రిమ్స్ కళాశాల వద్ద జూనియర్ డాక్టర్ల నిరసన

ప్రభుత్వ మద్యం షాపులో చోరీ

- ఇనుపపెట్టె బద్దలుగొట్టి నగదు అపహరణ


క్యాష్ కౌంటరులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ బృందం..

పలాస, ఆగస్టు 16: కేటీ రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. ఇనుప పెట్టెను బద్దలు కొట్టి అందులో నగదును దుండగులు ఎత్తుకెళ్లిపోయారు. స్వాతంత్ర్య దినోత్సవం కారణంగా గురువారం ఈ దుకాణాన్ని తెరవలేదు. శుక్రవారం ఉదయం సిబ్బంది వచ్చి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ కేటీ రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణం (జీఆర్‌ఓ-1125)లో దొంగలు పడ్డారు. ఈ దుకాణంలో బుధవారం మద్యం విక్రయాలు చేపట్టగా వచ్చిన రూ.2,03,830ను.. ఆ రోజు రాత్రి 9 గంటల సమయంలో సిబ్బంది ఇనుప లాకరులో దాచారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం కారణంగా దుకాణం తెరవలేదు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సేల్స్‌మెన్, సిబ్బంది వచ్చి తలుపులు తీయగా.. లాకర్ బద్దలు కొట్టి ఉండడాన్ని గుర్తించి ఎక్సైజ్ సిబ్బందికి, కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు వెనుక భాగం నుంచి దొంగలు ప్రవేశించి లాకర్‌ను గుణపాంతో బద్దలు కొట్టి అందులో ఉన్న రూ.2,03,830 తస్కరించారు. మద్యం బాటిళ్లను మాత్రం ముట్టుకోలేదు. ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని కాశీబుగ్గ ఎస్‌ఐ పారినాయుడు, సిబ్బంది పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీమ్ సభ్యులు వచ్చి వేలిముద్రలు సేకరించారు. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఈ దుకాణం పక్కనే ఉన్న గోల్డ్‌షాపులో కూడా దొంగతనానికి యత్నించి విఫలం చెందారు. ఈ క్రమంలో బుధవారం రాత్రే మద్యం దుకాణంలోనూ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమేరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా.. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో అంతర్రాష్ట్ర దొంగలు సంచరిస్తున్నారనే అనుమానాలకు ఇటీవల జరుగుతున్న చోరీలు బలపరుస్తున్నాయి. కొద్దినెలల కిందట పాత జాతీయరహదారిపై బ్యాటరీ షాపు, విద్యుత్ పరికరాల షాపుల్లో కూడా ఇటువంటి చోరీలే జరిగాయి. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

రెండు నెలలుగా..

- నిలిచిపోయిన 'నీలి గ్రానైట్' అనుమతులు
- ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌లోకి పర్మిట్ల విధానం


గ్రానైట్ క్వారీల్లో నిలిచిన బ్లాకులు

(టెక్కలి)

జిల్లాలో నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. కూటమి ప్రభుత్వం గనుల శాఖ పరిధిలోని ఆఫ్‌లైన్ పర్మిట్ల విధానాన్ని ఆన్‌లైన్‌లోకి మార్చింది. సాంకేతికత మార్పుల కారణంగా పర్మిట్ల జారీ రెండు నెలలుగా నిలిచిపోయింది. ఫలితంగా జిల్లాలో 80 పైగా ఉన్న నీలిరంగు గ్రానైట్ క్వారీల పరిస్థితి పడకేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రానైట్ క్వారీలకు సంబంధించి పర్మిట్ల జారీ పాత జిల్లాల ప్రాప్తికి అనంతపురం, కడప, చిత్తూరు, గుంటూరు, తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆఫ్‌లైన్ విధానాన్ని అనుకరించారు. విశ్వసముద్ర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నెలకు రూ.12.85కోట్లతో టెండర్లు దక్కించుకొని.. ఆఫ్‌లైన్ పర్మిట్లను జిల్లాలో జారీ చేసేది. జిల్లాలో చెక్‌పోస్టులు పెట్టి 200మంది సిబ్బందితో నిరంతర తనిఖీలు చేసేది. ఈ సంస్థ వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకూ టెండర్ల గడువు పొంది ఉంది. కాగా.. రాష్ట్రంలో కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, కృష్ణ, విశాఖ జిల్లాల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ విధానాన్ని సిక్కోలు కూడా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాంకేతిక సమస్యలు సరిదిద్దుతూ.. అడుగులు ముందుకేస్తోంది.


టెక్కలిలోని గ్రానైట్ క్వారీలో కదలని లారీలు

- గనుల శాఖ పరిధిలో పర్మిట్లు జారీచేసిన సందర్భాల్లో జిల్లా నుంచి ఏడాదికి సుమారు లక్షా15వేల క్యూబిక్ మీటర్ల గ్రానైట్ బ్లాకుల ఉత్పాదన జరిగేది. విశ్వసముద్ర సంస్థ టెండర్లు దక్కించుకున్న తరువాత ఏడాదికి సుమారు లక్షా40వేల క్యూబిక్ మీటర్ల మేరకు పర్మిట్లు జారీ చేశారు. ప్రస్తుతం ప్రక్రియ ఆన్‌లైన్‌లోకి మారడంతో రెండు నెలలుగా పర్మిట్లు నిలిచిపోయాయి. దీంతో ఒక్కో క్వారీ నుంచి 200 నుంచి 300 మీటర్లు ఆర్డర్లు బుక్ చేసుకున్న విదేశీ బయ్యర్లు మోర్నమెంట్‌కు సంబంధించి అగ్రిమెంట్లు రద్దు చేసుకుంటున్నారు. ఇతర కలర్ గ్రానైట్ల వైపు దృష్టి సారిస్తున్నారు. చైనా, జపాన్, జర్మన్, స్పెయిన్, పోలాండ్, ఇటలీ, తైవాన్ తదితర దేశాలకు చెందిన విదేశీ బయ్యర్లు పూర్తిగా నీలి రంగు గ్రానైట్ వైపు ముఖం చాటేశారు. ఫలితంగా నీలిరంగు గ్రానైట్ క్వారీల యాజమాన్యాల్లో అయోమయం నెలకొంది. ఇక క్వారీల్లో మోర్నమెంట్ మెటీరియల్ చెల్లకపోతే తమకు ఆర్థిక కష్టాలు తప్పవని యాజమానులు తలలు పట్టుకున్నారు. మరికొన్ని పరిశ్రమల్లో క్వారీ నిర్వహణకు అవసరమయ్యే యంత్ర పరికరాల ఈఎంఐలు కట్టలేని స్థితి నెలకొంది. ఆన్‌లైన్ పర్మిట్లు ఎప్పుడు జారీచేస్తారోనని.. అంతవరకు తమ పరిస్థితి అగమ్యగోచరమేనని క్వారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు..

పర్మిట్లు లేకపోవడంతో నీలిరంగు గ్రానైట్ క్వారీల్లో మెటీరియల్ ఎక్కడికక్కడే కుప్పలు తెప్పలుగా ఉంది. ఏ గ్రానైట్ క్వారీలో చూసినా మోర్నమెంట్, శ్లాబ్ మెటీరియల్ బ్లాకులు దర్శనమిస్తున్నాయి. గ్రానైట్ బ్లాకులు తరలించే ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు సైతం 2 నెలలుగా మూలకు చేరాయి.

ఉపాధికి దూరం..

పర్మిట్లు మంజూరు కాక నీలిరంగు గ్రానైట్ క్వారీలు నిలిచిపోవడంతో ఈ పరిశ్రమలపై ఆధారపడిన స్కిల్డ్, అన్‌స్కిల్డ్ లేబర్ ఉపాధికి దూరమయ్యారు. వైర్‌సా, జాకీ, కంప్రెషర్ ఆపరేటర్లు, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్లు, టిప్పర్ డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మైన్స్ మేనేజర్లు, క్వారీ ఇన్‌చార్జిలు పనుల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయానికి గండిపడింది.

ఈ విషయమై మైన్స్ ఏడీ ఫణిభూషణరెడ్డి వద్ద ప్రస్తావించగా ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్ పోర్టల్‌లోకి పర్మిట్ విధానం సాంకేతికంగా మార్చనుండడంతో పర్మిట్లు జారీలో జాప్యం నెలకొందన్నారు. త్వరలో సాంకేతిక లోపాలు సరిదిద్ది.. ఆన్‌లైన్ పర్మిట్లు జారీ చేస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 17 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



శ్రీకృష్ణుడే అవార్డుని తెచ్చాడు

కార్తికేయ 2 చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు గొప్ప విజయం అని ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారం గెలుచుకున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తికేయ 2' మొదలుపెట్టినప్పుడే పెద్ద సినిమా అనుకున్నాం. ఇంత సక్సెస్‌ను ఊహించలేదు. జాతీయ పురస్కారం దక్కడం మా సంస్థకు చాలా గొప్ప విషయం' అన్నారు. ఈ అవార్డునే శ్రీకృష్ణుడే తీసుకొచ్చాడని భావిస్తున్నాను అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నేషనల్ అవార్డ్ మాపై బాధ్యతను మరింత పెంచింది అని చందు మొండేటి తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తను తీస్తున్న 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తను హీరోగా నటించిన 'కార్తికేయ 2' జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని హీరో నిఖిల్ చెప్పారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ - 2 అవార్డు పొందటం సంతోషకరం. ఉత్తమ నటి నిత్యామీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నృత్య దర్శకుడిగా ఎంపికైన జానీ మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు.

- పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

70వ జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు అభినందనలు. ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి, ఉత్తమ నటి నిత్యామేనన్.. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్', కార్తికేయ 2' మేకర్స్‌కు అలాగే ఇతర పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు

- చిరంజీవి

రిషబ్‌శెట్టికి అభినందనలు. 'కాంతార' చిత్రానికి ఉత్తమ నటుడి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. అందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తివి. 'కాంతార' చిత్రంలో నీ అభినయం గుర్తుకు వస్తే ఇప్పటికీ నాకు గూస్ బంప్స్ వస్తున్నాయి.

- ఎన్టీఆర్

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో.. దుమ్మురేపిన సౌత్ సినిమా

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించగా, ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకు గాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సైతం 'కాంతార' నిలిచింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్(తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్ ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా 'గులెహర్' నిలిచింది. 'పొన్నియిన్ సెల్వన్-1' చిత్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. మలయాళ, తమిళ చిత్రాలకు ఐదు చొప్పున అవార్డులు ప్రకటించగా, కన్నడ సినిమాకు మూడు పురస్కారాలు వచ్చాయి. తెలుగుకు దక్కింది ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఒక్కటే! 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగాను ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

నాలుగోసారి దక్షిణాది హీరోలదే హవా

తాజాగా రిషబ్ శెట్టిని జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం వరించడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ అరుదైన ఘనతను సాధించినట్లైంది. వరుసగా నాలుగుసార్లు దక్షిణాది హీరోలు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2019లో ధనుష్‌కు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలసి ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2020లోనూ సూర్య, అజయ్ దేవ్‌గణ్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా') చిత్రానికి గాను సూర్య ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2021లో 'పుష్ప' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇప్పుడు 2022కి గాను రిషబ్‌శెట్టిని ఈ పురస్కారం వరించింది. అంతకు ముందు 2010లో కూడా 'ఆడుకాలం' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి కూడా ఉత్తమ నటుడి పురస్కారానికి దక్షిణాది నుంచి మమ్ముట్టి, రిషబ్ శెట్టి, బాలీవుడ్ నుంచి విక్రాంత్ మాసే (ట్వల్త్ ఫెయిల్) పోటీ పడగా అదృష్టం రిషబ్‌ను వరించింది. మమ్ముట్టి 'నాన్పకల్ నేరట్టు మయక్కం, రోషాక్ రెండు చిత్రాలతో బరిలో నిలిచినా ఫలితం నిరాశపరిచింది.



తెలుగు సినిమాకు అన్యాయం జరిగిందా?



జాతీయ చలనచిత్ర అవార్డులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది తెలుగు సినిమాకు ఉత్తమ జాతీయ నటుడు అవార్డు సహా తొమ్మిది అవార్డులు రావడంతో కాలరు ఎగరేసిన తెలుగు ప్రేక్షకుడు ఈసారి ప్రకటించిన అవార్డుల్లో తెలుగు సినిమాకు ఒక్కటంటే ఒక్క అవార్డ్ కూడా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచనలో పడ్డాడు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత సినిమాలకు ప్రభుత్వ అవార్డులు అన్నవి లేనేలేవు. ఇప్పుడైనా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితి. ఫిల్మ్ ఫేర్ వంటి ప్రైవేట్ అవార్డులను పక్కన పెడితే, సినిమా ప్రముఖులు ఆశించేది, రావాలని కోరుకునేది జాతీయ చలనచిత్ర అవార్డులే. జాతీయ అవార్డ్ పొందితే కెరీర్ పరంగా ఏదో సాధించామనే సంతృప్తి చాలా మందికి ఉంటుంది. అయితే జాతీయ అవార్డు అందుకునే స్థాయి కలిగిన చిత్రాలు తెలుగులో ఎన్ని వస్తున్నాయనేది ఒక ప్రశ్న. తెలుగు చిత్ర పరిశ్రమలో టాలెంట్‌కు కొదువ లేదు. సినీ ప్రపంచమంతా తెలుగు చిత్రపరిశ్రమ వైపే చూస్తున్న రోజులివి. కొత్త తరహాగా ఆలోచించడం, కష్టపడే తత్వం తెలుగు వారికి ఎక్కువ. అయినా సరే కొత్త తరహా చిత్రాల గురించి ఆలోచించకుండా కమర్షియల్ చిత్రాలపై మోజుతో నిర్మాతలు పరుగులు తీస్తున్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. కాకపోతే ఈ ఏడాది ఢిల్లీకి పంపిన చిత్రాల్లో అవార్డుకు అర్హమైనవి కొన్ని ఉండడం వాటికి ఒక్క అవార్డ్ కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది.

కరోనా కారణంగా..

శుక్రవారం ప్రకటించిన నేషనల్ అవార్డ్స్ 2022 సంవత్సరం లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు సంబంధించినవి. వాస్తవానికి 2023 మే 3న ఈ అవార్డులను ప్రదానం చేయాలి. అయితే కరోనా తర్వాత జాతీయ చలన చిత్ర అవార్డుల షెడ్యూల్‌లో మార్పులు జరిగాయి. అవార్డుల ఎంపిక, ప్రదాన కార్యక్రమం ఆలస్యమవుతూ వస్తున్నాయి. లోకసభకు జరిగిన ఎన్నికల కారణంగా జాతీయ అవార్డులు ఈసారి మరింత ఆలస్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైనా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని మధ్యలోనే ఆపేసి ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాక మళ్లీ మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రకటించిన అవార్డులను అక్టోబరు నెలలో విజేతలకు అందజేస్తారని సమాచారం.

ఇరవై సినిమాలు... ఒకే ఒక్క అవార్డ్

జాతీయ అవార్డుల కోసం తెలుగు నిర్మాతలు ఈసారి పెద్ద సంఖ్యలోనే ఎంట్రీలు పంపారు. ఆ జాబితాలో ఉన్న సినిమాలు ఏమిటంటే 1. రైటర్ పద్మభూషణ్, 2. సీతారామం 3. అంటే సుందరానికి.. 4. విరాటపర్వం 5. యశోద 6. రాధేశ్యామ్ 7. సర్కారు వారి పాట 8. మర్రి చెట్టు 9. కుదిరామ్ బోస్ 10. ఇట్లు మారేడుమిల్లి 11. కార్తికేయ 2 12. డీజె టిల్లు 13. ఇక్షా 14. ధమాకా 15. చదువే నా ఆయుధం 16. బింబిసార 17. భారత పుత్రులు 18. ఎట్ లవ్ 19. అశోకవనంలో అర్జున కల్యాణం 20. అల్లూరి. ఇన్ని సినిమాలు పంపిస్తే వాటిల్లో ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఏ అవార్డూ దక్కలేదు. ఇది ఆలోచించాల్సిన అంశం. 'కార్తికేయ 2' చిత్రానికి ఇచ్చారు కదా అని అంటే అది ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో ఇచ్చిన అవార్డు. ఆ అవార్డు తెలుగు సినిమాకే ఇవ్వాలి కనుక కంటితుడుపు అన్నట్లు 'కార్తికేయ 2'కు ప్రకటించి చేతులు దులుపేసుకుంది అవార్డుల కమిటీ.

ఆ రెండు సినిమాలను పక్కన పెట్టేశారా?

'యుద్ధం రాసిన ప్రేమ లేఖ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకొన్న చిత్రం 'సీతారామం' వైజయంతీ మూవీస్ సంస్థ సగర్వంగా సమర్పించిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించిన సినిమా ఇదని టాలీవుడ్ సెలబ్రేట్ చేసుకుంది. చక్కని కథ, కథనాలతో రూపుదిద్దుకున్న 'సీతారామం'కు జాతీయ అవార్డు ఖాయం అని అందరూ అనుకున్నారు. తీరా శుక్రవారం ప్రకటించిన అవార్డుల జాబితాలో ఆ సినిమా ఊసే లేదు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే 'సీతారామం' చిత్రం చివరి వరకూ పోటీలో ఉంది. అయితే అందులో సుమంత్ పోషించిన పాత్ర పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉందనే సాకుతో అవార్డుల కమిటీ సినిమాను పక్కను పెట్టేసిందట. అలాగే నక్సలైట్లకు అనుకూలంగా, నక్సలిజాన్ని సమర్థించే రీతిలో 'విరాటపర్వం' చిత్రం ఉందంటూ ఆ సినిమాను కూడా పక్కన పెట్టేశారని అంటున్నారు. కల్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రం కూడా కొత్త తరహా ప్రయత్నం. ఆ సినిమాను కూడా అవార్డుల కమిటీ పట్టించుకోలేదు. జ్యూరీలో తెలుగు సభ్యుడు కనీసం ఒకరున్నా తెలుగు సినిమాకు ఇలా అన్యాయం జరిగేది కాదనీ, ఫైట్ చేసి ఏదో ఒక సినిమాకు అవార్డ్ తీసుకువచ్చేవారని అంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సభ్యులు ఎవరూ లేకపోవడంతో . ఇతర భాషల వారు పెత్తనం చెలాయించి, అవార్డుల పరంగా తెలుగు సినిమాకు అన్యాయం చేశారని చిత్ర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి అవార్డులు ఇచ్చారు కానీ..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ముగ్గురికి ఈసారి జాతీయ అవార్డులు రావడం కొంతలో కొంత ఉపశమనం. అయితే వారు అవార్డులు పొందింది తెలుగు చిత్రాలకు కాదు.. తెలుగేతర చిత్రాలకు.

నిత్యా మీనన్‌కు జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ వచ్చింది. అయితే తెలుగు సినిమా కాదు 'తిరుచిత్రంబలం' తమిళ చిత్రం. అలాగే ఎ.ఆర్.రెహమాన్ కూడా తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికే ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డ్ పొందారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కూడా తమిళ సినిమాతోనే జాతీయ అవార్డ్ పొందారు.

70 వ జాతీయ చలనచిత్ర అవార్డులు

- **ఉత్తమ చిత్రం:** 'ఆట్టమ్ (మలయాళం)
- **ఉత్తమ నటుడు:** రిషబ్ శెట్టి (కాంతార- కన్నడం)
- **ఉత్తమ నటి:** నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్- గుజరాతీ)
- **ఉత్తమ దర్శకుడు:** సూరజ్ బర్జాత్యా (ఉంఛాయి- హిందీ)
- **హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్:** కాంతార (కన్నడ)
- **ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్:** బ్రహ్మాస్త్ర పార్ట్ 1 - శివ
- **ఉత్తమ నూతన దర్శకుడు:** ప్రమోద్‌కుమార్- (ఫౌజ- హరియాన్వి)
- **ఉత్తమ సహాయ నటి:** నీనా గుప్తా (ఉంఛా- హిందీ)
- **ఉత్తమ సహాయ నటుడు:** పవన్ రాజ్ మల్హోత్రా- (ఫౌజ)
- **ఉత్తమ బాలనటుడు:** శ్రీపథ్ (మాలికాపురం- మలయాళం)
- **ఉత్తమ ఛాయాగ్రాహకుడు:** రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత:** ఆనంద్ ఏకార్షి(ఆట్టమ్)
- **ఉత్తమ సంభాషణల రచయితలు:** అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టేలా (గుల్ మొహర్)
- **ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు):** ప్రీతమ్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం):** ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ గీత రచయిత:** నౌషాద్ సదర్ ఖాన్-(ఫౌజ)
- **ఉత్తమ నేపథ్య గాయకుడు:** అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర 1 - శివ)
- **ఉత్తమ గాయని:** బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225 -2009)
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం:** (కార్తికేయ 2 - తెలుగు)
- **ప్రత్యేక ప్రశంస:** నటుడు మనోజ్ వాజ్‌పాయ్ (గుల్ మోహర్- హిందీ), సంగీత దర్శకుడు - సంజోయ్ సలీల్ చౌదరి (కదికన్ - మలయాళం)
- **ఉత్తమ ఎడిటర్:** మహేశ్ భువనేంద్ (ఆట్టమ్)
- **ఉత్తమ యాక్షన్ డైరెక్టర్:** అన్బరివు (కేజీఎఫ్ 2'
- **బెస్ట్ బుక్ ఆన్ సినిమా:** కిశోర్‌కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)- రచయితలు- అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
- **బెస్ట్ క్రిటిక్:** దీపక్ దుహా (హిందీ)

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

- రెండో శుక్రవారం మహిళలతో ఆలయాలు కిటకిట
- సామూహిక కుంకుమార్చనలు
- వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. వివిధ ఆలయాలకు తెల్లవారుజాము నుంచే తరలివెళ్లి సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజల్లో పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.

-ఆంధ్రజ్యోతి బృందం


కొత్తూరు: వరప్రద వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు


నరసన్నపేట: తామరాపల్లి శ్రీరామమందిరంలో సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు


కోటబొమ్మాళి: శివకేశవ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


శ్రీకాకుళం కల్లరల్: లక్ష్మీదేవి అలంకరణలో విజయదుర్గమ్మ


శ్రీకాకుళం కల్లరల్: సంతోషిమాత అమ్మవారు


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారు


సోంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పసుపు కొమ్ములతో అలంకరణ


ఎచ్చెర్ల: కుంచాల కుర్మయ్యపేటలోని శ్రీచక్రాల వద్ద పూజలు





నందిగాం సంతోషిమాత ఆలయంలో.. ఎల్.ఎన్.పేట: మోదుగవలస జంక్షన్, జలుమూరు: శ్రీముఖలింగం వారాహి సన్నిధిలో, ఆమదాలవలస: శివాలయంలో మహిళల పూజలు


మందస అన్నపూర్ణ ఆలయంలో..


జలుమూరు (సారవకోట):గొర్రిబందలో ముర్రాటలతో ఊరేగింపు

20న దివ్యాంగ పింఛన్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

జలుమూరు: సైరిగాం గ్రామంలో నకిలీ దివ్యాంగ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్న 33 మంది లబ్ధిదారులు ఈనెల 20న శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో హాజరుకావాలని నోటీసులిచ్చినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్నారని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో పరిశీలించాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి ద్వారా వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దర్యాప్తునకు హాజరుకాని వారిని పింఛన్లకు అనర్హులుగా ప్రకటిస్తామన్నారు.

విపత్తుల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాల నిక్కు

టెక్కలి: భూకంపాలు, వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు స్పందిస్తున్న తీరు శ్లాఘనీయమని, అయితే బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి దీర్ఘకాల ప్రణాళికలు అవసరమని కెనడా తాంప్సన్ రివర్ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ ప్రొఫెసర్ బాల నిక్కు అన్నారు. శుక్ర వారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ విద్యార్థులతో 'ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ హ్యాండ్లింగ్' అంశంపై మాట్లాడారు. విపత్తుల సహాయక చర్యలు పూర్తయిన తరువాత బాధితుల మానసిక, శారీరక, ఆరోగ్య పరిస్థితులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం డా.బాల నిక్కును కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, ఐటీ హెచ్‌వోడీ పి.రమేష్ నాయుడు, ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాలులకు నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు


మెళియాపుట్టి: పొలంలో నేలకొరిగిన స్తంభం

మెళియాపుట్టి: మండలంలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఎక్కువగా గాలులు వీయడంతో గొప్పిలి నుంచి చిన్నాహంస గ్రామానికి వెళ్లే లైన్‌లో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోగా, మరో మూడు నేలకొరిగాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు. స్తంభాలు నేలకొరిగిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. రోడ్లపై వైర్లు పడడం, ఆ సమయంలో ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తితలీ తుఫాన్ సమయంలో విద్యుత్ స్తంభాలు కూలిపోగా వాటి స్థానంలో ఏర్పాటుచేసిన స్తంభాలు సక్రమంగా పతకపోవడంతో ఏమాత్రం గాలులు వీచినా వాలిపోతున్నాయని సర్పంచ్ శనపతి రవికుమార్ పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తక్షణం విద్యుత్‌ను పునరుద్ధరించాలని కోరారు. ● **ఎల్.ఎన్.పేట:** మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుముల శబ్దానికి ఇళ్లల్లోని వారు భయాందోళన చెందారు. వంశధారకుడి ప్రధాన కాలువ ఎగువ ప్రాంతంలో ఉన్న పంట పొలాలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వాడిపోయిన పంటలకు ఈ వర్షం ఊపిరిపోసినట్లయిందని పలువురు రైతులు పేర్కొన్నారు. ● **పాతపట్నం:** పాతపట్నంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయమంతా ఉక్కపోతతో విసుగెత్తించినా సాయంత్రానికి కురిసిన వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. ప్రధాన మార్గాల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.

రేపు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ

పలాసరూరల్: గోపాలపురం గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు ఛత్రపతి శివాజీ యువసేన గౌరవాధ్యక్షుడు కె.దేవ దత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలాస, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గౌతు శిరీష, ఎన్.ఈశ్వరరావు హాజరుకానున్నారన్నారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.

జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులాహ్వానం

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ సబ్జెక్ట్ బోధనకు గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.శ్రీరాములు తెలిపారు. జువాలజీతో పీజీలో కనీసం 55 శాతం మార్కులు పొంది ఉండి స్లెట్, నెట్ పీహెచ్‌డీ ఉన్నవారికి, అనుభవమున్న వారికి ప్రాధాన్యం నివ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 20న ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9989484645, 8179820908 నెంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

'స్కిల్' కోర్సుల్లో ట్యూటర్ నియామకానికి..

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో డెవలప్‌మెంట్ కోర్సుల్లో ట్యూటర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాలవ్యవధిలో కోర్సు పూర్తి చే యాల్సి ఉంటుందన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు పీజీ కంప్యూటర్ కోర్సు విద్యార్హత ఉండాలన్నారు. డేటా రికవరీ ఏజెంట్ కోర్సు బోధనకు ఎంకాం లేదా ఎంబీఏ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు 20న ఇంటర్వ్యూల నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9553292734, 8179820908 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

పాతపట్నం: జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా ఈనెల 20న అవగాహన, మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది చేపడతారని ఎంపీడీవో పేడాడ జయంత్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, గ్రామాల్లో నులిపురుగల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకి సూచించారు.

శతశాతం లక్ష్యాలు పూర్తిచేయాలి

పాతపట్నం: కలెక్టర్ ఆదేశాల మేరకు 100 రోజుల లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీవో పీజే ప్రసాద్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమయపాలన పాటించని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

సంతబొమ్మాళి: పాతమేఘవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు పురస్కారాలు అందించారు. పలువురు విద్యార్థులకు తన సొంత నగదు అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యూడీవీ ప్రసాదరావు, ఎస్‌ఎంసీ ఛైర్‌పర్సన్ గాడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

పలాసరూరల్, ఆగస్టు 16: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరిచ్చేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆఫ్‌షోర్ ప్రాజెక్టు, కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.122 కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించిందని, దీని ద్వారా మెళియాపుట్టి, నందిగాం, పలాస మండలాల భూములకు సాగు, పలాస-కాశీబుగ్గ పట్టణాలకు తాగునీరు అందించే లక్ష్యంతో నిర్మాణం చేపట్టారన్నారు. అయితే సరైన భూసేకరణ, ఆర్ అండ్ఆర్ సరిగా చేపట్టలేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.400 కోట్లు మంజూరు చేశామని, అందులో రూ.300 కోట్లు ఆర్అండ్ఆర్, ల్యాండ్ అక్విజైషన్‌కు కేటాయించి పనులు వేగవంతంచేశామన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టు పనుల్లో కేవలం 7 శాతం మాత్రమే పూర్తి చేసి వదిలేశారన్నారు. రెండేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలుంటే తక్షణం పరిష్కరించాలన్నారు. అలాగే కాశీబుగ్గ ఫ్లై ఓవర్‌పై సమీక్షించారు. ఇప్పటికే రైల్వేపరిధి బ్రిడ్జి పూర్తి అయిందని, పదిమంది నిర్వాసితులకు పరిహారం వారికి జమ కాలేదని సంబంధిత అధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం సమస్యను పరిష్కరించి పనులు ప్రారంభించాలన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

పట్టణ తాగునీటి సమస్య పరిష్కరించండి

ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, జల్‌జీవన్ మిషన్ నుంచి తాగు నీరందించేలా చర్యలు చేపట్టాల ని కోరారు. వైసీపీ ప్రభుత్వం తొలి నాలుగేళ్లలో కేటీ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా చివరి సంవత్సరం హడావుడిగా చేయడంతో పనులు అస్తవ్యస్తంగా జరిగి వర్షం కురిస్తే రోడ్డు చెరువును తలపిస్తోందన్నారు. మహేంద్రతనయ, ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీటిని జంట పట్టణాలకు అందజేయాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు కడుపు నిండా భోజనమే లక్ష్యం: శిరీష

కాశీబుగ్గ: నిరుపేదలకు కడుపునిండా భోజనం పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని, ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ సమీపంలో శుక్రవారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.5కే భోజనం అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలిరోజు క్యాంటీన్‌లో మూడు పూటలా భోజనం ఖర్చును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వజ్జ గంగాభవాని విరాళంగా అందించారు. శిరీష లైన్‌లో ఉండి టిఫిన్‌ను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయగా ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మూసివేసి నిరుపేదలకు అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని మళ్లీ పునఃప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీని విమర్శించిన వైసీపీ నేతలు కూడా అన్నక్యాంటీన్లలో భోజనం చేయవచ్చని, తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, డొక్కరి శంకర్, సప్ప నవీన్, రవిశంకర్ గుప్తా, శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, డీఈ కనకరాజు, ఏఈ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైలు సేవల కుదింపు

పాతపట్నం, ఆగస్టు 16: నౌపడ-పర్లాకిమిడి మధ్య రైల్వేట్రాక్ పనుల కారణంగా శనివారం రైలుసేవల్లో అంతరాయాలు కలుగుతాయని రైల్వే అధికారులు తెలిపారు. శని వారం విశాఖ-గుణుపూర్ రైలు విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు వచ్చి తిరిగి విశాఖపట్నం వెళుతుందన్నారు. అలాగే రూర్కెలా-గుణుపూర్ రైలు రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రూర్కెలా నుంచి పలాస వరకు వచ్చి తిరిగి పలాస నుంచి రూర్కెలా వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మార్పులను గమనించాలని ప్రయాణికులను కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగాం: నందిగాం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దతామరాపల్లి, లట్టిగాం ఫీడర్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు మర మ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నందిగాం, పెద్దతామరాపల్లి, కణితివూరు, హరిదాసుపురం, గొల్లూరు, దిమిలాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

బన్నువాడ ఫీడర్ పరిధిలో..

టెక్కలి: బన్నువాడ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మోదుగువలస, బన్నువాడ, అయోధ్యపురం, ఎస్ఆర్‌కే పురం, దీపావళిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మెళియాపుట్టి ఫీడర్ పరిధిలో..

మెళియాపుట్టి: మెళియాపుట్టి విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ శంకరరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 2 గంటలు వరకు పెద్దపద్మాపురం, కొసమాళ, వసుంధర, నేలబొంతు, బందపల్లి, గ్రామాల పరిధిలో అంతరాయం కలుగుతుందన్నారు.

నౌపడ సబ్ స్టేషన్ పరిధిలో..

సంతబొమ్మాళి: నౌపడ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునుందని విద్యుత్‌శాఖ ఏఈ ఎం.శివ కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్‌లలో చెట్ల కొమ్మలు, పొదల తొలగింపు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నౌపడ-భావనపాడు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలని సూచించారు.

హిరమండలం ఫీడర్ పరిధిలో..

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ చేపడుతున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు తెలిపారు. హిరమండలం, నౌగూడ, సుభలయ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

మందస సబ్ స్టేషన్ పరిధిలో..

మందస: మందస 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ యోగేశ్వరరావు తెలిపారు. హరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ అంబుగాం ఫీడర్‌ను ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు తెలిపారు.

రేపు ఆదివాసీ సమస్యలపై సదస్సు

పలాసరూరల్: నీలావతి గ్రామంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆదివాసీల సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్లు వేదిక సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. దండకారణ్యంలో ఆదివాసీల మారణకాండ, ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న మైనింగ్ ఒప్పందాలు, ఆది వాసీ ప్రాంతాల్లో మిలటరీ క్యాంపుల సమస్యలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల సీఈ సుగుణాకరరావు


పనులను పరిశీలిస్తున్న సీఈ

హిరమండలం: వంశధార రిజర్వాయర్ పనులతో పాటు అనుసంధానంగా చేపట్టిన స్పిల్‌వే, ఎత్తిపోతల పథకం పనులను గడువులోగా పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు ఆదేశించారు. శుక్రవారం హిరమండలం వద్ద జరుగుతున్న ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. రిజర్వాయర్ పనులు 98 శాతం, కుడి కాలువ సమీపంలో ఎత్తిపోతల పనులు 20 శాతం పూర్తయ్యాయని ఎస్ఈ రాంబాబు వివరించారు. రిజర్వాయర్ పనులు పూర్తికా వస్తున్నాయన్నారు. వర్షా కాలంలో పనులకు ఆటంకం కలుగుతున్నప్పటికీ వాటిని అధిగమించి పనులు వేగవంతం చేయాలని సీఈ అన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కూడా పూర్తి స్థాయిలో చేపట్టేం దుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో వంశధార ఈఈ ఎంవీ రమణ, డీఎస్ఏ స్వర్ణకుమార్, డీఈ రవికాంత్, సురేష్, రవీంద్ర, ఏఈ పాల్గొన్నారు.

జీవో 1108ను రద్దు చేయాలి

- 5110 రోజులుగా కొనసాగుతున్న దీక్షలు


మాట్లాడుతున్న సన్నశెట్టి రాజశేఖర్

సంతబొమ్మాళి: కాకరాపల్లి థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం వేలాది ఎకరాల తంపర భూములను ఏపీఐఐసీకి అప్పగిస్తూ గతంలో జారీ చేసిన జీవో 1108ని రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డితాండ్రలో దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులు, ప్రజలపై అక్రమంగా బనాయించిన కేసులు ఎత్తివేయాలన్నారు. ఏపీఐఐసీకి కేటాయించిన భూములను లీజుదారులైన మత్స్యకారులకు పంచాలని కోరారు. ఉత్తరాంధ్ర పోరాట సమితి కన్వీనర్ సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ.. చిత్తడి నేలల పరిరక్షణకు పోరాటం చేయాలన్నారు. 1108 జీవోకి వ్యతిరేకంగా 5110 రోజులుగా చేపడుతున్న నిరవధిక దీక్షలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. దీక్షలు ప్రారంభమై 14 ఏళ్లవుతున్నా పాలకుల్లో చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు వెంకటరావు, హనూరావు, కోత మధు, కారుణ్య, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

నందిగాం: మండలంలో ఈనెల 8న కోరం లేక, వివిధ వివాదాల కారణంగా నిలిచి పోయిన కణితివూరు, పెద్దబాణాపురం ఉన్నత పాఠశాలల కమిటీ ఎన్నికలు శనివారం నిర్వ హించనున్నట్లు ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు తెలిపారు. మరలా ప్రభుత్వం ఎన్నికలకు ఉత్తర్వులిచ్చిందని, ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీస్ బందో బస్తు కోరినట్లు వారు తెలిపారు. ● **హిరమండలం:** ఈ నెల 8న జరగాల్సిన గొట్ట, చిన్న కొల్లివలస ఆర్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలతో పాటు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోరం లేక వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నికలను శనివారం నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామికి శుక్రవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వామికి గ్రామోత్సవం చేపట్టారు. ఈవో పి.ప్రభాకరరావు, భక్తులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనిలో చేర్చుకోవద్దు

పాతపట్నం: బడిఈడు పిల్లలను బడిలోనే ఉండాలని, పనిలో కాదని కార్మికాధికారి వైఎస్ కుమార్ అన్నారు. పాతపట్నంలో పలు దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఇద్దరు బడిఈడు పిల్లలు పనిలో ఉండగా గుర్తించి వారిని బడిలో చేర్పించాలని దుకాణదారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది టి.శ్రీనివాసరావు, బ్రెడ్స్ చైల్డ్‌లైన్ ప్రతినిధులు ఎస్.వైకుంఠరావు, జి.జగన్, ఎం.పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


జగదీష్(ఫైల్)

కోటబొమ్మాళి: విజయనగరం సమీపంలోని లంకాపట్నం-రాళ్లమళ్లపురం గ్రామాల పరిధిలో రైల్వేట్రాక్ పై చిన్నహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన ఉప్పాడ జగదీష్(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జగదీష్ విశాఖలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నారు. విశాఖలో ఉండాల్సిన జగదీష్ విజయనగరం పరిధిలో విగత జీవిగా ఉండడంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇది హత్య లేక ఆత్మహత్య? అనేది తేలాల్సి ఉంది. తండ్రి సూర్యారావు పెయింటర్, తల్లి లక్ష్మి వ్యవసాయ కూలీ, చెల్లి డిగ్రీ చదువుతుంది. అవివాహితుడైన జగదీష్ మరణవార్త తెలియడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని విజయనగరం పోస్టుమార్టంకు తరలించినట్లు అతని బంధువులు తెలిపారు. జగదీష్ మృతిపై విచారణ చేపట్టి నిజానిజాలు తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

లారీ కేబిన్‌పై నుంచి జారీ.. క్లీనర్ మృతి


సంబార్(ఫైల్)

కోటబొమ్మాళి: జాతీయ రహదారిలో పెద్దబమ్మిడి దాబా వద్ద గురువారం రాత్రి లారీ క్యాబెన్ పై నుంచి జారీ పడి గంజాం జిల్లా బూమకుంప మండలం అతిగూడ గ్రామానికి చెందిన లారీ క్లీనర్ మున్న సంబాల్ (35) మృతి చెందాడు. రాజమండ్రి నుంచి కటక్ వెళ్తూ విశ్రాంతి కోసం గురువారం రాత్రి దాబా వద్ద అపగా క్లీనర్ గాలికోసం లారీపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో కేబిన్ పై నుంచి కిందకు జారిపడి మృతి చెందాడు. తెల్లవారి డ్రైవర్ లేచి చూడగా క్లీనర్ మున్న విగతజీవిగా పడి ఉండడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ షేక్ మమ్మద్ అలీ కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం


రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్న దృశ్యం

బూర్జ: పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కొంత మంది డీలర్లు లబ్ధిదారులకు ఎంతో కొంత ఇచ్చేసి దోచుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైపు పౌరసరఫరాశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నా అక్రమ రవాణా మాత్రం యధేచ్ఛగా సాగిపోతుంది. గత ప్రభుత్వంలో అప్పటి నాయకుల అండదండలతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగగా.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోని కొంతమంది నాయకులను మంచి చేసుకొని వారి అండతో రాత్రికి రాత్రే రేషన్ బియ్యాన్ని వాహనాల్లో తరలిస్తున్నారు. కార్డుదారులు నుంచి రూ.10కి కొనుగోలు చేస్తున్న కొంతమంది డీలర్లు.. వ్యాపారులకు రూ.16 నుంచి రూ.18కు విక్రయిస్తున్నారు. ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయిస్తున్న వ్యాపారులు కిలో రూ.40 నుంచి రూ.45 వరకు మార్కెట్‌లో అమ్ముకొని లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో ఈ వ్యాపారంలోకి కొత్త కొత్త వ్యక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో గత రాత్రి ఉప్పినివలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సుమారు వెయ్యి కిలోల పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో అక్రమంగా తరలించినట్టు ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను విలేకరులకు అందజేశారు. ఇప్పటికైనా ఇలాంటి అక్రమ రవాణాను అధికారులు అడ్డుకొని, ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరుతున్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి

హరిపురం: కొండలోగాం పంచాయతీ జన్నివీధి గ్రామంలో శుక్రవారం దాడులు చేసి 1100 లీటర్ల బెల్లం ఊటలు, 25 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ జైభీమ్ తెలిపారు. గ్రామ సమీపంలోని జీడి తోటల్లో వీటిని తయారు చేస్తుండగా దాడి చేశా మన్నారు. సారా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏజెన్సీలోని కొండ లు, లోయల్లో సారా తయారీని అడ్డుకొని అక్రమ రవాణాపై దృష్టి సారిస్తామని చెప్పారు. సారా తయారీ, అమ్మకాల విషయమై 9440902358 నెంబరుకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతారావు, యోగినాయుడు తదిరతులు పాల్గొన్నారు.

కుక్కల దాడి.. బాలుడికి గాయం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పట్టణంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన 12 ఏళ్ల హరి అక్షిత్ పండాపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వెంటనే 15వ వార్డు స్థానిక నేత బల్ల శ్రీనివాసరావు స్పందించి అక్షిత్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అక్షిత్‌పండా ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్తుండగా అమాంతంగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయన్నారు. జంట పట్టణాల్లో కుక్కలు విపరీతంగా పెరిగాయని, దీంతో గతం లోనూ అనేక మంది గాయాలబారిన పడ్డారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈఏపీ సెట్ తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల: ఇంటర్మీడియట్ ఎంపీసీ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణులై బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యా శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్-2024 తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసినట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ప్రిన్సిపాల్, హెల్ప్‌లైన్ కేంద్రం కోఆర్డినేటర్ జి.దామోదరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ప్రోసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీలోగా కళాశాలలు, కోర్సుల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 23న ఆప్షన్లలో మార్పులు, చేర్పులు చేసేందుకు వీలుందన్నారు. ఈ నెల 26న ఎంపిక జాబితా వివరాలను సెట్ కన్వీనర్ ప్రకటిస్తారన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ కావాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 1200 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 600 రూపాయలు చెల్లించాలన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం


ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించినట్టు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీప శర్మ, దర్భముళ్ల, శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్నాళ్లీ గుంతల పాట్లు

సరుబుజ్జిలి: మండల కేంద్రం సమీపంలో ఆలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై సుమారు కిలోమీటరు దూరం ఏర్పడిన భారీ గుంతల పాట్లు ఇంకా ఎన్నాళ్లు అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుంచి అంతరరాష్ట్ర రహదారిగా రాకపోకలు సాగిస్తున్న ఈ ప్రాంతంలో ప్రతిరోజూ ఏదో ఒక వాహనం ఈ గుంతల్లో ఇరుక్కోవడం పరిపాటిగా మారింది. శుక్రవారం విశాఖ వెళుతున్న ఇసుక లారీ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏబీ రహదారి గుంతలో ఇరుక్కుంది. ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని తొలగించడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ సమయంలో ప్రధాన రహదారిలో వాహనాలు బారులుతీరాయి. ప్రతినిత్యం స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న గుంతల్లో భారీ వాహనాలు ఇరుక్కోవడం, వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.


రహదారి మధ్యలో ఇరుక్కుపోయిన లారీ


సోంపేట: మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం


హరిపురం: లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పేదల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న


- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- జిల్లా వ్యాప్తంగా జయంతి కార్యక్రమాలు


వర్షిణికి ప్రతిభా పురస్కారం అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి: ఉత్తరాంధ్ర గడ్డ నుంచి ఎగసిన రాజకీయ కెరటం, జీవితాంతం బడుగు, బలహీన వర్గాల కోసం ఉద్యమాలు చేసిన ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధునిగా, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారునిగా, రాజకీయ నాయకునిగా లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయన్ని మహనీయునిగా నిలబెట్టిందన్నారు. ఈ సందర్భంగా శ్రీశయన కులానికి, లచ్చన్న ఆశయాల సాధనకు డీవీఎస్ ప్రకాష్ చేసిన సేవలకు గాను ఆయన సతీమణికి సేవా పురస్కారం, అలాగే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన గుజ్జల వర్షిణికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, టీడీపీ నాయకులు మాదారపు వెంకటేష్, మెండ దాసునాయుడు, చౌదరి బాబ్జీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లచ్చన్న సేవలు నిరుపమానం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష, టీడీపీ నాయకులు


వజ్రపుకొత్తూరు: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పలాస: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన గౌతు లచ్చన్న సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు లొడగల కామేశ్వరరావు యాదవ్, వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్ తదితరులు పాల్గొన్నారు. లచ్చన్న జయంతి సందర్భంగా స్థానిక సీతారామాలయంలో అన్నదానం చేశారు. అలాగే పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచి పెట్టారు.

- **సోంపేట:** గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. లచ్చన్న ఘాట్ వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ నివాళులర్పించారు. మాజీ మంత్రి గౌతు శివాజీ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. శ్రీశయన సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో 500 పైబడి మార్కులు వచ్చిన విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేశారు.


కంచిలి: మఠం కంచిలిలో టీడీపీ నాయకులు..


ఎల్ఎన్ పేట: నివాళులర్పిస్తున్న దృశ్యం


మందస: లచ్చన్న విగ్రహానికి నివాళులు..

దివ్యాంగులు ఎవ్వరికీ తీసిపోరు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- గ్రీవెన్స్ 'స్వాభిమాన్' ప్రారంభం


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ పుండ్కర్

కలెక్టరేట్: దివ్యాంగులు ఎందులోను, ఎవ్వరికీ తీసిపోరని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల గ్రీవెన్స్ హాలులో విభిన్న ప్రతిభావంతుల వినతులు స్వీకరణ కార్యక్రమాన్ని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సూచన మేరకు ప్రతీ నెలా మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్' నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం నాటి గ్రీవెన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి 46 వినతులను స్వీకరించారు. కాగా కలెక్టరేట్‌కు వివిధ పనులపై వస్తున్న దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపును కోటబొమ్మాళి మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు రత్నాల శ్రీనివాసరావుతో ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో డీఆర్వో అప్పారావు, డీపీవో వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, సీపీవో ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు.

సమన్వయంతోనే సమస్యలకు పరిష్కారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిసా గ్రామాల మధ్య ఉన్న సమస్యలను ఇరు రాష్ట్రాల అధికారులను సమన్వయం చేసుకొని ప్రతీ సమస్యను పరిష్కరించుకుందామని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి కంచ్రవీధి-సుమండి జంక్షన్ వద్ద అధ్వానంగా ఉన్న రహదారిని ఎమ్మెల్యేతో పాటు ఒడిసా చీకటి ఎమ్మెల్యే మను శామంతరాయ్‌తో కలిసి పరిశీలించారు. ఇరు ప్రాంతాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్లన్నీ అధ్వానంగా మారాయన్నారు. రాష్ట్రం, కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఉంది అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నీ పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, సాలిన ఢిల్లీ, కొండా శంకర్‌రెడ్డి తదితరు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులతో భోజనం చేస్తున్న న్యాయాధికారి

ఇచ్ఛాపురం: పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన నాణ్యత కల్గిన భోజనం అందించాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరీష్ కుమార్ అన్నారు. శనివారం బెల్లుపడ గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ప్రతీ తరగతి పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మరుగుదొడ్లు, తాగునీరు పరిశీలించారు. విద్యార్థులతో భోజనం చేసి భోజనం రుచిని పరిశీలించారు.

పార్టీ క్యాడర్‌కు అండగా ఉంటా


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి: పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని మంత్రి కింజరాపు అచ్చెనాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన శ్రీకాకుళం నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. నగర కార్పొరేషన్‌పై అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లోను గెలుపు సొంతం చేసుకునేలా పనిచేయాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేతో సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి రవాణా అరికట్టాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో గంజాయి రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం రాత్రి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి కేసుల్లో అరెస్టు అయిన వారి నుంచి అమ్మిన, సరఫరా చేస్తున్న వారి సమాచారం తెలుసుకోవాలన్నారు. అలాగే గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన వారిపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. జైలు నుంచి విడుదలైన వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు బాల చంద్రారెడ్డి శ్రీనివాసరావు, త్రినాధరావు, వై.శృతి, ఏవో గోపినాథ్ లీగల్ అడ్వైజర్ హేమ, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ


ధ్రువపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: అవయవదానంతోనే పునర్జన్మ సాధ్యపడుతుందని, మరణానంతరం కూడా ఏదో ఓ రూపంలో జీవిస్తుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన దుక్క భాస్కరరావు(22) ఈ నెల 14 పెయింటింగ్ పనికి వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అతడిని జెమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయింది. కావడంతో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు శుక్రవారం రెండు కిడ్నీలు, లివర్‌దానం చేశారు. ఒక కిడ్నీని జెమ్స్‌కి, మరొకటి విశాఖ, లివర్‌ను విశాఖలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం భాస్కర్ కుటుంబ సభ్యులకు అవయవదాన పత్రాన్ని శంకర్ అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీనివాసు, వైద్యులు శివాన్వేష్, ప్రవీణ్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

- **అరసవల్లి:** తన సూచనను ఆచరణలో పెట్టి 484 రోజులు ఎటువంటి అవాంతరాలు ఎదురైనా ఆగకుండా సొంత ఖర్చులతో, పేదల కోసం అన్న క్యాంటీన్ సేవలు అందించిన ఎమ్మెల్యే గొండు శంకర్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సత్కరించారు. నేటితో ప్రభుత్వమే అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తున్న సందర్భంగా శంకర్ తన సేవలను మరో విధంగా అందించాలని కోరారు.
- **శ్రీకాకుళం కల్చరల్:** నగర పరిధి బలగలోని నాగావళి నదీ తీరాన వెలసిన శ్రీబాల త్రిపుర సుందరి కాలభైరవ ఆలయంలో గణేష్ గురువు ఆధ్వర్యంలో శ్రావణమాస పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐదు లక్షల గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి 120 రకాల పిండి వంటకాలతో నైవేద్యం అందించారు. మెండ దాసునాయుడు, రెడ్డి గిరిజా శంకర్, సాధు రామారావు, రామకృష్ణ, చిట్టి విష్ణు, రంజిత్, జగన్ స్వామి, పీఠం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమాల నిర్వహణలో సహకారమందించారు.

వైభవంగా శ్రావణ మాసోత్సవాలు


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీలలిత, శ్రీ మహాలక్ష్మి సహస్ర నామ స్తోత్ర పారాయణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 100మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అద్భుతంగా పారాయణం చేసిన శైలజ, ఉమ, ఇందిరాలకు శ్రావణ లక్ష్మి విజేతలకుగా ప్రకటించారు. శ్రావణ లక్ష్మి లక్కీ డీప్ ద్వారా మొదటి బహుమతిగా ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సర్వం సిద్ధం


క్రీడా దుస్తులు అందజేస్తున్న సురేష్

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూనియర్ స్థాయి బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలకు సర్వం సిద్ధమయింది. ఈ నెల 17, 18, 19వ తేదీల్లో ఇక్కడి ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా నిర్వహించే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొంటున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన బాలికలకు ఆర్‌సీఎం లయోల ఇలిసుపురం, బలగ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వసతి సౌకర్యం నిర్వహించనున్నారు. ఏడు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాలలో బాలురకు వసతి సౌకర్యం కల్పించారు.

శ్రీకాకుళం ఏఎస్పీగా ప్రభాకరబాబు

శ్రీకాకుళం క్రైం: రాష్ట్రవ్యాప్తంగా ఏఎస్పీల బదిలీలు శుక్రవారం రాత్రి జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.ప్రేమ్‌కాజల్ విశాఖ సీఐడీ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సీఐడీ (టెక్నికల్ సర్వీసెస్) ఏఎస్పీగా ఉన్న టీటీ ప్రభాకర బాబును నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది ఏఎస్పీలకు బదిలీలు జరిగాయి. అలాగే విజిలెన్స్ ఎస్పీ ఎ.సురుష్ బాబుకు బదిలీ అయింది. విజయవాడ పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీఅయ్యాయి. అలాగే సెబ్ అడిషనల్ ఎస్పీ డి.గంగాధరం బదిలీ చేశారు. పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఎచ్చెర్ల, అనమిత్ర టౌన్‌షిప్‌లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింపునకు, ఇతర మరమ్మతుల కోసం సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

- **సోంపేట:** బుషాభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో బాతుపురం, విక్రంపురం, ఎంజీ పురం, బకుడా, పైడిగాం, హంసమొర, కే.బాతుపురం తదితర గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.
- **ఇచ్ఛాపురం:** సబ్ స్టేషన్ విద్యుత్ మరమ్మతులు చేయనున్నందున్న శనివారం మున్సిపాల్టీ పరిధిలో గల పలు వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గోవిందరావు తెలిపారు ఉదయం 9గంటల నుండి మధ్యహ్నం 2గంటల వరకు గొల్లవీధి, వీకేపేట, కోర్టు రోడ్, ఎంతోటూరు, రత్తకన్న, మండపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

సరుబుజ్జిలి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ ఆదివారం జరగనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో బీవీఎస్ ప్రసాదరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఈ నెల 21న బుధవారం నిర్వహించే తలపెట్టిన ఈ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే కూన రవి కుమార్ మౌఖిక ఆదేశాలు ప్రకారం 18వ తేదీ ఆదివారం మార్చడం జరిగిందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజుర కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

రణస్థలం: శ్యామ్‌క్రగ్ పిస్టన్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ పరిశ్రమ జీఎం కిషోర్‌తో ఎమ్మెల్యే ఎస్ఈఆర్ కార్మికుల సమస్యలపై చర్చించారు. 30 ఏళ్లకు పదవీ విరమణ గడువు పెంచాలని, ఉత్పత్తులు, ఇతర సమస్యల కోసం అడిగి తెలుసుకున్నారు. ఇదే విడషయం కార్మికులు, యాజమాన్యానికి చర్చలు జరుగుతున్నాయని, కోర్టును ఆశ్రయించడం జరిగిందని జీఎం కిషోర్ వివరించారు. సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సిక్కోలు క్రీడాకారుడు


సత్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్: క్రీడలకు పుట్టినిల్లయిన శ్రీకాకుళం జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదు. అన్ని క్రీడాంశాల్లో సత్తాచాటుతూ ఆల్‌రౌండ్ ప్రతిభను కనబరుస్తున్నారు. గతమెంతో వాలీబాల్‌లో కీర్తిని కూడగట్టుకున్న సిక్కోలు నుంచి మరో ఆణిముత్యం జాతీయస్థాయిలో సత్తాచాటుతున్నాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం చిన కొవ్వాడ మత్స్యలేశంకు చెందిన మైలపల్లి సత్యం గల్లీ నుంచి జాతీయస్థాయి వరకు ఎదిగాడు. జాతీయస్థాయి క్రీడల్లో అత్యున్నత కేంద్రంగా పేరొందిన నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకు సత్యం ఎంపికై ఔరా అనిపించాడు. దేశం నమూలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్న ఎంపిల్లో మూడు పర్యాయాలుగా వివిధ రకాల పరీక్షలు జరిపి కేవలం 20 మంది మేటి క్రీడాకారులను మాత్రమే ఎంపిక చేశారు. ముఖ్యంగా ఈ వేదికకు వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హడక్ కమిటీ వారు దేశంలో వాలీబాల్ క్రీడ ఉన్నతికి భారత వాలీబాల్ ప్రధాన శిక్షకుడు సెర్బియా దేశానికి చెందిన హై పెర్ఫార్మెన్స్ కోచ్ డ్రాగన్ మిహిలోవ్క్ పర్యవేక్షణలో ఎంపికయ్యాడు. జిల్లాకు చెందిన మైలపల్లి సత్యం ఇదివరకే వాలీబాల్‌లో ఖేలో ఇండియా యూత్ క్రీడలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి పతకం తేవడంలో ప్రధాన భూమిక పోషించాడు. గతేడాది నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికై పది లక్షల రూపాయల నగదు పురస్కారాన్ని అందుకున్నాడు. గత మూడేళ్లుగా శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో వాలీబాల్ శిక్షకుడు కళ్లేపల్లి హరికృష్ణ పర్యవేక్షణలో కఠోర శిక్షణ పొందుతున్నాడు. క్రీడల్లో మరింత పదును పెడితే అంతర్జాతీయ వేదికలపై కూడా తన సత్తాను నిరూపించుకుంటాడని శిక్షకుడు హరికృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధి చెందిన దేశంగా భారత్

కలెక్టరేట్: 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నైపుణ్య శిక్షణ, పునరుత్పాదక ఇంధన వనరులు, వాణిజ్యపరంగా పర్యాటకాభివృద్ధి వంటి రంగాల్లో మండలాల వారీగా అధికారులు ప్రణాళికలు తయారుచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు, సీపీవో లక్ష్మీప్రసన్న, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలను నమోదు చేయాలి

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసుల శాఖలో ఉత్తమ సేవలందించే పోలీసుల పేర్లతో పాటు వారి సేవలను కూడా సర్వీస్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆర్ట్స్ కళాశాల మైదానంలో మెరుగైన ప్రదర్శనతో ప్రత్యేకంగా నిలిచి పోలీసు కవాతు నిర్వహించిన సిబ్బందికి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో పరేడ్ కమాండర్ డీఎస్పీ ఎల్ శేషాద్రి, ఆర్ఎస్ఐ అక్షరకుమార్, నీలిమ, సిబ్బంది, హోంగార్డులు ఉన్నారు.

వృక్షాలను కాపాడుదాం

సోంపేట: పర్యావరణ సమతుల్యతకు మహావృక్షాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి అన్నారు. రాఖీపౌర్ణమి సందర్భంగా మహావృక్షాలకు శుక్రవారం పూజలు నిర్వహించి రాఖీ కట్టారు.